క్లుప్తంగా

పేదలకు విద్య, వైద్యం అందాలి



భీమ్‌గల్: పేదలకు ప్రభుత్వం విద్య, వైద్యం అందించాలని సీపీఐ ఎంఎల్, ప్రజాపంథా రాష్ట్ర సభ్యుడు వి.ప్రభాకర్ అన్నారు. సేవాలాల్ యూత్ ఆధ్వర్యంలో మండలంలోని తాళ్లపల్లి, గంగరాయి గ్రామాల్లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించగ, ప్రభాకర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గిరిజన తండాల్లో వైద్యం అందక పేదలు ఇబ్బందులకు గురవుతున్నారని, ధనిక వర్గాలకు కొమ్ముకాస్తున్న ప్రభుత్వాలు పేదలకు విద్యం, వైద్యం అందకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు సీపీఐఎంఎల్ ప్రజాపంథా ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి దేవారాం, మండల కార్యదర్శి రాజేశ్వర్, అపర్ణ ఆస్పత్రి సీనియర్ వైద్యుడు ప్రకాశ్, యూత్‌సభ్యులు, వైద్యులు పాల్గొన్నారు.

స్వర్గయాత్ర రథం వితరణ



కమ్మర్‌పల్లి: మండలంలోని హాసాకొత్తూర్ గ్రామానికి పూర్వ విద్యార్థులు (2003 – 04) స్వర్గయాత్ర రథాన్ని వితరణ చేశారు. పూర్వ విద్యార్థులందరూ కలిసి రూ.2.50లక్షలతో రథాన్ని తయారు చేయించారు. రథాన్ని ఆదివారం గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులకు అప్పగించారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు లావుడ్యా వసంత్, సోముల నరేందర్, గంగారాం, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు బోధన్‌కు ఎమ్మెల్యే రాక

బోధన్‌టౌన్(బోధన్): ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సోమవారం బోధన్ పట్టణానికి రానున్నారని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పాషా మొయినుద్దీన్, వర్కింగ్ ప్రెసిడెంట్ హరికాంత్‌చారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12గంటలకు సుదర్శన్‌రెడ్డి బోధన్‌కు చేరుకుంటారని, ఆచన్‌పల్లి కమాన్ నుంచి ద్విచక్ర వాహనర్యాలీ అనంతరం, రవి గార్డెన్‌లో సన్మాన కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

శివాజీ విగ్రహావిష్కరణ..

మోర్తాడ్: మండలంలోని దొన్కల్‌లో ప్రతిష్ఠించిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించనున్నట్లు ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు తెలిపారు. సామాజిక సమరసతా వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్‌జీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు కోరారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు..

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై ఉన్న శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగేస్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయ పరిసర ప్రాంతాల్లో ఊరేగిస్తామని, భక్తులు పాల్గొనాలని వారు కోరారు.

ఆదిమల్లన్న స్వామికి గంగస్నానం

వేల్పూర్: మండలంలోని పడగల్‌లో ఆదిమల్లన్న జాతర ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం ఆదిమల్లన్న స్వామిని గంగస్నానానికి తీసుకెళ్లారు. పల్లకీని ఊరేగింపుగా గోదావరి తీరానికి తీసుకెళ్లారు. మల్లన్నస్వామిని, రథాన్ని డప్పువాయిద్యాలతో సోమవారం మల్లన్నగుట్టకు తీసుకెళ్తారు. మంగళవారం జాతర, రథోత్సవం నిర్వహించనున్నారు.

సీఎస్‌ఐ చర్చిలో క్యారెల్స్ సండే

బోధన్‌టౌన్(బోధన్): క్రిస్మస్‌ను పురస్కరించుకొని పట్టణంలోని సీఎస్‌ఐ చర్చిలో క్యారెల్స్ సండేను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ.. క్యారెల్స్ సండేలో భాగంగా చర్చి సభ్యులు ఇంటింటికీ వెళ్లి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుతారని, క్యారెల్స్ పండుగ ఐదు రోజులపాటు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు జ్యోతిరాజ్, సందీప్, ఎడ్వర్డ్, అనిల్, బర్నబాస్, దాస్, పుష్పాంజలి పాల్గొన్నారు.

రైతుబంధులో జరిగిన దోపిడీపై విచారణ జరపాలి

ఖలీల్‌వాడి: రైతుబంధు పేరుతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన దోపిడీపై కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే విచారణ జరిపించాలని బీఎల్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ సొమ్ము కాజేసిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారుల నుంచి రికవరీ చేయాలన్నారు. ప్రజల సొమ్మును ప్రజలకు అందించాలని కోరారు.

వంతెన ప్రారంభమెన్నడో?

- నెలక్రితం వంతెన నిర్మాణం పూర్తి
- వెంటనే ప్రారంభించాలని స్థానికుల డిమాండ్



పాత వంతెన పైనుంచి వెళ్తున్న ద్విచక్ర వాహనం



పోచంపాడ్ - సోన్‌పేట్ గ్రామాల మధ్య కాకతీయ కాలువపై నిర్మించిన వంతెన

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్, సోన్‌పేట్ గ్రామాల మధ్య కాకతీయ కాలువపై వంతెన నిర్మాణ పనులు నెలక్రితం పూర్తయినప్పటికీ ప్రారంభం కాలేదు. దీంతో వంతెనను ఎప్పుడు ప్రారంభిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రెండు గ్రామాల మధ్య ఉన్న కాకతీయ కాలువపై కాలువ నిర్మాణ కాలంలో చిన్న వంతెనను ఇనుప రాడ్లతో నిర్మించారు. వంతెన శిథిలావస్థకు చేరడంతో రెండు గ్రామాల ప్రజలు పాలకులకు మొర పెట్టుకున్నారు. దీంతో గత ప్రభుత్వం రూ.1.38 కోట్ల నిధులను మంజూరు చేయగా, పనులు గత మార్చి నెలలో ప్రారంభమయ్యాయి. పనులను నూతన టెక్నాలజీతో చేపట్టి ఎనిమిది నెలల కాలంలో పూర్తి చేశారు. పనులు వేగంగా పూర్తి కావడంపై రెండు గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. కానీ వంతెన ప్రారంభానికి నోచుకోకపోవడంతో ఇరుక వంతెన పైనుంచే ప్రయాణం సాగిస్తున్నారు. ఇరుకు వంతెన శిథిలావస్థకు చేరుకుని పలు చోట్ల రంధ్రాలు కూడా పడ్డాయి. ఇన్నాళ్లు గత్యంతరం లేక పాత వంతెన పైనుంచి రాకపోకలు కొనసాగించారు. నూతన వంతెన నిర్మాణ పనులు పూర్తయినప్పటికీ ప్రారంభానికి నోచుకోకపోవడంతో తమకు కష్టాలు తప్పడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నూతన టెక్నాలజీతో నిర్మాణం

కాకతీయ కాలువపై వంతెన నిర్మించాలనుకుంటే కాలువ ద్వారా నీటి విడుదల కొనసాగినప్పుడు పనులను నిలిపి వేయాల్సి వచ్చేది. కానీ నూతన టెక్నాలజీ ద్వారా వంతెన నిర్మాణ పనులు చేపట్టడంతో కాలువ ద్వారా నీటి ప్రవాహం ఉన్నప్పటికీ ఆటంకం ఏర్పడలేదు. దీంతో ఎనిమిది నెలల కాలంలోనే పనులు పూర్తయ్యాయి. నూతన టెక్నాలజీ ద్వారా వంతెన నిర్మించేందుకు ప్రభుత్వం రూ.1.38 కోట్లు మంజూరు చేసింది. కాలువ నిండుకుండలా ప్రవహించినప్పటికీ పనులను ఆపకుండా పూర్తి చేశారు.

త్వరలో ప్రారంభిస్తాం

వంతెన నిర్మాణ పనుల్లో కొద్దిపాటి పనులు మిగిలిపోయాయి. ఆ పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించాం. పనులు పూర్తయిన వెంటనే వంతెను ప్రారంభిస్తాం.

– చక్రపాణి, ఈఈ, ఎస్సారెస్పీ

పలువురికి బీజేపీ ఆర్థిక సాయం



బాలకిషన్‌కు చెక్కు అందజేస్తున్న ఎంపీ అర్వింద్

మాక్లూర్/వేల్పూర్: భారతీయ జనతాపార్టీ బూత్ స్థాయి సభ్యుల సహాయ నిధి నుంచి ఎంపీ అర్వింద్ పలువురికి ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. మాక్లూర్ మండలం చిక్లి గ్రామానికి చెందిన కంఠం రాజేశ్వర్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా, ఆయన భార్య లక్ష్మికి రూ.లక్ష, కృష్ణానగర్‌కు చెందిన దేదావత్ రమేశ్ ఇటీవల గుండెపోటు రావడంతో స్టంట్‌వేయించుకోగా, అతడికి రూ.40వేల చెక్కును అందజేశారు. అలాగే ముత్యంపల్లికి చెందిన తోట హరీశ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో ఉండగా, అతడికి రూ.10వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గంగోనె సంతోష్, పార్టీ మండల అధ్యక్షుడు సురేశ్ నాయక్, చిన్నాపూర్ వినోద్ పాల్గొన్నారు. వేల్పూర్ మండలం మండలంలోని పచ్చలనడ్కుడ గ్రామానికి చెందిన పోతుల బాలకిషన్‌కు ఎంపీ ధర్మపురి అర్వింద్ రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. బాలకిషన్ ఇటీవల కొత్త ఇల్లు నిర్మించుకోగా, అతడికి ఆర్థికసాయం చేశారు. మాజీ ఎంపీటీసీ దురాజి రవి పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రోడ్డు



కోతకు గురైన రుద్రూర్ - బొప్పాపూర్ రోడ్డు

రుద్రూర్: మండలంలోని బొప్పాపూర్ గ్రామ సమీపంలో ఉన్న వాగు వద్ద రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. భారీ వర్షాలు కురవడంతో రోడ్డు పైనుంచి వాగు ప్రవహించింది. దీంతో రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి పడిపోయి ప్రమాదాల బారిన పడుతున్నారు. కోటగిరి, పోతంగల్, రుద్రూర్ మండలాల నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు ఇదే దగ్గరి దారి. ఈ రోడ్డు మీదుగా వందలాది ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కోతకు గురైన రోడ్డును వెంటనే బాగు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

శ్వాస మీద ధ్యాసే ధ్యానం



మాట్లాడుతున్న సాయికృష్ణారెడ్డి



ధ్యానం చేస్తున్న మహిళలు

బాల్కొండ: శ్వాస మీద ధ్యాసనే ధ్యానమని పీఎస్‌ఎస్‌ఎం జిల్లా అధ్యక్షుడు సాయికృష్ణారెడ్డి అన్నారు. ముప్కాల్ మండల కేంద్రంలో ఆదివారం ధ్యాన ఆత్మజ్ఞాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధ్యానంతో ఒత్తిడిని జయించ వచ్చని, ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. ధ్యానానికి ఎంతో శక్తి ఉందని, ప్రతి ఒక్కరూ సాధన చేయాలని సూచించారు. ఈ నెల 21 నుంచి 31వ తేదీ వరకు రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మహేశ్వర మహాపిరమిడ్ పత్రీజీ శక్తి స్థల్ వద్ద నిర్వహించనున్న పత్రీజీ ధ్యాన మహాయాగం-2కు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నవనాథపురం పిరమిడ్ అధ్యక్షుడు తిరుమల గంగారాం, మాస్టారు జానాబాయి, ధ్యాన బంధువులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

- పెద్దవాగు నుంచి తరలింపు
- పట్టించుకోని అధికారులు



ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్

బాల్కొండ: నియోజకవర్గం పరిధిలోని పెద్దవాగు నుంచి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా కొనసాగుతున్నది. రాత్రీపగలు తేడా లేకుండా వ్యాపారులు ఇసుకను తరలిస్తున్నారు. ఓవైపు వారి అక్రమ వ్యాపారం మూడు టిప్పర్లు, ఆరు ట్రాక్టర్లుగా కొనసాగుతుండగా, మరోవైపు ప్రభుత్వ ఖజానాకు గండిపడుతున్నది. గతంలో ప్రభుత్వానికి డీడీ రూపంలో నగదు చెల్లిస్తే వే బిల్లుల ద్వారా ఇసుక తరలింపునకు వారంలో రెండు రోజులు అనుమతి ఇచ్చేవారు. ప్రస్తుతం అలాంటి నిబంధనలు ఏవీ లేకుండాపోయాయి. ఎవరికి నచ్చిన రీతిలో వారు ఇసుక దందా సాగిస్తున్నారు. నియోజకవర్గంలోని వేల్పూర్, మోర్తాడ్, ఏర్గట్ల, ముప్కాల్, మెండోరా మండలాల మీదుగా పెద్ద వాగు ప్రవహిస్తోంది. ఇసుక అక్రమంగా తరలించే వ్యాపారులు ఒక మండలం పేరు చెప్పి మరో మండలంలో ఇసుకను తవ్వుతున్నారు. సెలవు రోజుల్లో మధ్యాహ్నం సమయంలో కూడా ఇసుకను తరలిస్తున్నారు.

ట్రాక్టర్ ఇసుక రూ.6 వేలు

అక్రమంగా తరలిస్తున్న ఇసుకను ట్రాక్టర్‌కు రూ.6వేల చొప్పున విక్రయిస్తున్నారు. అధికారులకు ఇచ్చే మామూళ్లను సైతం కలుపుకొని వసూలు చేస్తున్నారు. అన్ని విభాగాల ప్రభుత్వ అధికారులకు తాము మామూళ్లు ఇస్తున్నామని ఇసుక వ్యాపారులు బహిరంగంగానే చెబుతుండడం గమనార్హం. ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవడంతోపాటు నిబంధనలకు మేరకు అనుమతలు ఇస్తే వినియోగదారులపై భారం తగ్గే అవకాశం ఉంది. ఇసుక అక్రమ రవాణాపై అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రకృతి వనానికి నీటికష్టాలు



పచ్చదనాన్ని కోల్పోతున్న మొక్కలు

బాల్కొండ: ముప్కాల్ మండలంలోని నల్లూర్ గ్రామ శివారులో ఉన్న బృహత్ ప్రకృతి వనానికి నీటి కష్టాలు తప్పడం లేదు. పల్లె ప్రగతిలో భాగంగా ప్రతి మండలంలో ఒక బృహత్ ప్రకృతి వనాన్ని నిర్మించారు. రెండేళ్లు గడుస్తున్నా నల్లూర్‌లోని ప్రకృతి వనానికి అధికారులు నీటి వసతిని కల్పించ లేదు. దీంతో మొక్కలు నీరందించడం కష్టంగా మారింది. వాటర్ ట్యాంకర్ ద్వారా సరఫరా చేస్తున్నప్పటికీ.. పూర్తి స్థాయిలో నీరందక మొక్కలు ఎండిపోతున్నాయి. పచ్చదనంతో కళకళలాడాల్సిన ప్రకృతి వనం కళావిహీనంగా మారుతోంది.

బోరు వేశారు.. కనెక్షన్ మరిచారు

బృహత్ పల్లె ప్రకృతి వనం వద్ద ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో రూ.1.25 లక్షల నిధులతో బోరు వేసినప్పటికీ విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం మరిచారు. బోరు వేసినా ప్రయోజనం లేకుండా పోయింది. నల్లూర్ గ్రామ శివారులోని పంట భూముల మధ్య గతంలో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం పాక్షికంగా ముంపునకు గురైన స్థలాన్ని కేటాయించారు. అక్కడ పంట భూములకు సంబంధించిన త్రీ ఫేజ్ కరెంట్ లైన్ మాత్రమే ఉంది. దీంతో విద్యుత్ కనెక్షన్ కోసం అడ్డంకులు ఏర్పడుతున్నాయని ట్రాన్స్‌కో అధికారులు తెలుపుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ కనెక్షన్ సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉంది.



కనెక్షన్ ఇవ్వకుండా వదిలేసిన బోరు

నిర్వహణపై నిర్లక్ష్యం

బృహత్ పల్లె ప్రకృతి వనం నిర్వహణ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వనం చుట్టూ వేసిన కంచె మొత్తం పడిపోయింది. వనంలో మొత్తం ఒకే రకమైన కానుగ మొక్కలను నాటారు. మొత్తం పిచ్చి మొక్కలతో నిండిపోయింది. అయినప్పటికీ అధికారులు అటు వైపుకన్నెత్తి చూడడం లేదు. అడవిలో వనం నిర్మించుటకు స్థలం కేటాయించారని ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. బృహత్ పకృతి వనాల దుస్థితి ఇలా ఉంటే పల్లెల్లోని పల్లె పకృతి వనాల దుస్థితి చెప్పనక్కర్లేదు. ఉన్నతాధికారులు స్పందించి వనాలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కార్మికుల భవిష్యత్‌పై ఆలోచించండి

బోధన్‌టౌన్(బోధన్) : ప్రభుత్వం నిజాం చక్కెర కార్మికుల భవిష్యత్‌పై ఆలోచన చేయాలని సీఐటీయూ నాయకుడు ఎస్ కుమారస్వామి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. నిపుణులతో ఓ కమిటీ వేయడంతోపాటు ఎమ్మెల్యేలతో షుగర్ ఫ్యాక్టరీలపై విచారణ జరిపిస్తామని సీఎం రేవంత్ రెడ్డి శనివారం అసెంబ్లీలో ప్రకటించడం శుభపరిణామమని ఆయన పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిజాం షుగర్స్ అంశాన్ని రాజకీయం కోసం వాడుకుందని విమర్శించారు. ఆ తరువాత ప్రైవేట్‌యాజమాన్యం లేఆఫ్ ప్రకటించిందని ఆవేదన వ్యక్తం చేశారు. కమిటీలతో కాలయాపన చేయకుండా కార్మికులకు అందాల్సిన బకాయిలను అందించాలని కోరారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం

నిజామాబాద్ సిటీ: నగరంలోని జెండా బాలాజీ ఆలయంలో ఆదివారం శ్రవణ నక్షత్రం సందర్భంగా శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ జాలిగాం గోపాల్, ఈవో వేణు ఆధ్వర్యంలో స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకులు నాగభూషణం, నాగరాజాచార్యులు, జూనియర్ అసిస్టెంట్ అంజనేయులు, భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన ఆలయ వార్షికోత్సవాలు

డిచ్‌పల్లి(మోపాల్): మోపాల్ మండలం బోర్గాం (పి) గ్రామంలోని శ్రీవల్లి దేవసేనా సమేత శ్రీసుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న 8వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం ఆలయ శాశ్వత అధ్యక్షుడి ఇంటి నుంచి స్వామి వారికి నూతన పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకువచ్చారు. అనంతరం స్వామివారికి మహాకుంభాభిషేకం, పంచామృతాభిషేకం, విశేష అలంకరణ, పల్లకీ సేవ, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి కల్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు.

కాంతి, స్మైల్ స్కూళ్లకు ఎక్సలెన్స్ అవార్డులు





అవార్డు అందుకుంటున్న కాంతి గంగారెడ్డి, డైరెక్టర్ శశాంక్.. స్మైల్ స్కూల్ డైరెక్టర్ రఫీ

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ కాంతి హైస్కూల్ స్కూల్ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపికైంది. బ్రెయిన్ ఫీడ్ సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శనివారం అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. భారత దేశంలోనే అత్యుత్తమ పాఠశాలల్లో ఒకటిగా కాంతి హైస్కూల్‌ను ఎంపిక చేస్తూ నిర్వాహకులు పాఠశాల కరస్పాండెంట్ కాంతి గంగారెడ్డి, డైరెక్టర్ శశాంక్‌కు అవార్డును అందజేశారు. కాంతి గంగారెడ్డి మాట్లాడుతూ.. పాఠశాల ఉన్నత స్థానంలో నిలవడానికి కృషి చేసిన విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవార్డును అకింతం చేస్తున్నట్లు వెల్లడించారు.

మూడోసారి స్మైల్ స్కూల్‌కు..

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని 'స్మైల్స్ ది స్కూల్' బ్రెయిన్ ఫీడ్ సంస్థ అందించిన అవార్డును మూడో ఏడాది సైతం అందుకుంది. స్కూల్ డైరెక్టర్ రఫీ గోహార్ ఎక్సలెన్సీ అవార్డును అందుకున్నారు. తమ స్కూల్‌కు మూడోసారి అవార్డు దక్కడం సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

ఘనంగా పెన్షనర్స్ డే



సన్మానం పొందిన పెన్షనర్లతో ఏసీపీ కిరణ్‌కుమార్

బోధన్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం డివిజన్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని పెన్షనర్స్ భవన్‌లో ఆదివారం పెన్షనర్స్ డేను ఘనంగా నిర్వహించారు. బోధన్ ఏసీపీ కిరణ్ కుమార్, తహసీల్దార్ గంగాధర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ క్రీడాపోటీల్లో విజేతలుగా నిలిచిన పెన్షనర్లకు బహుమతులను అందజేశారు. అనంతరం పెన్షనర్లను సన్మానించారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌రావు ,ప్రతినిధులు మురహరి, సాయిలు, భూమయ్య, సభ్యులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – చే లాంగ్‌లీవ్(తెలుగు)-12.50
జోరుగా హుషారుగా (తెలుగు)- 3.40, 6.40
కలశ(తెలుగు)- 9.50

స్క్రీన్-2 – హాయ్ నాన్న (తెలుగు)- 12.00, 03.15, 6.30, 09.45

స్క్రీన్-3 – తికమక తండా (తెలుగు)- 12.15,
హాయ్ నాన్న - 2.45
ఎక్స్‌ట్రా ఆర్డినరీ మెన్ -06.00
పిండం (తెలుగు) - 09.20

స్క్రీన్-4 – యానిమల్(తెలుగు)- 10.00, 2.00, 6.00, 9.00

సురేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు



రుద్రూర్‌లో జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కోటగిరి(రుద్రూర్)/వర్ని: బాన్సువాడ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి పోచారం సురేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కోటగిరి ప్రభుత్వాసుపత్రి, అమ్మ అనాథ ఆశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. రుద్రూర్‌లోని పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పత్తి లక్ష్మణ్, కార్యదర్శి బాల్‌రాజ్, తోట్ల గంగారాం, విండో మాజీ చైర్మన్ పత్తి రాము, సర్పంచులు ఖాదర్, లక్ష్మణ్, నాయకులు అక్కపల్లి నాగేందర్, రమేశ్, సాయిలు, గంగారాం తదితరులు పాల్గొన్నారు. వర్ని మండల కేంద్రంలో పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ హరిదాసు, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు వెలగపూడి గోపాల్, వర్ని సొసైటీ చైర్మన్ సాయిబాబా, పార్టీ మండల అధ్యక్షుడు గిరి, నాయకులు బుజ్జన్న, గఫార్, హైమద్, రెడ్డి వీర్రాజు, శ్రీహరి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): రాష్ట్ర స్థాయి 67వ స్కూల్ గేమ్స్ బేస్‌బాల్ బాలురు, బాలికల అండర్- 17 పోటీలకు మండలంలోని మిట్టాపల్లి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు, ధర్మారం(బి)సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/కళాశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈసందర్భంగా ఆయా పాఠశాలల్లో ఆదివారం ఎంపికైన క్రీడాకారులను అధ్యాపకులు అభినందించారు. మిట్టాపల్లి నుంచి బాలుర విభాగంలో రాథోడ్ మురళి, కొమిరె విష్ణు, బాలికల విభాగంలో కొమిరె గంగాజమున, గాండ్ల రసజ్ఞ ఎంపికయ్యారని హెచ్‌ఎం సుశీల్‌కుమార్, పీఈటీ గంగామోహన్ తెలిపారు. అలాగే ధర్మారం నుంచి విద్యార్థినులు నక్షత్ర, శరణ్య ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ సంగీత, ఫిజికల్ డైరక్టర్ సీరజారెడ్డి తెలిపారు. ఈనెల 16నుంచి 18 వరకు మహబూబాబాద్ జిల్లా తొర్రూర్‌లో జరుగుతున్న 67వ రాష్ట్ర స్కూల్ గేమ్స్ పోటీల్లో ఎంపికైన విద్యార్థులు పాల్గొంటారని వారు తెలిపారు.